

కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

# తోరణం తొలగిస్తే ఉద్యమం తప్పదు

- న్యాయవాదుల హెచ్చరిక.. వరంగల్ కోర్టు ఎదుట నిరసన

వరంగల్ లీగల్, మే 31: రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణాన్ని, చార్మినార్ చిహ్నాలను తొలగించి ఓరుగల్లు గౌరవాన్ని దిగజార్చేలా వ్యవహరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం తీరును ఖండిస్తున్నామని.. చిహ్నాల తొలగింపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే మరోసారి ఉద్యమిస్తామని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు మాతంగి రమేశ్‌బాబు హెచ్చరించారు. ఈ సందర్భంగా శుక్రవారం వరంగల్ కోర్టు ఎదుట న్యాయవాదులు నిరసన తెలిపారు. సీనియర్ న్యాయవాది ముద్దసాని సహోదర్‌రెడ్డి మాట్లాడుతూ చరిత్రను పరిశీలిస్తే కాకతీయ రాజులు ప్రజారంజక పాలన అందించి వారి ఆర్థిక ఎదుగుదలకు ఎంతో తోడ్పడ్డారన్నారు. ఆ రోజుల్లోనే దూరదృష్టితో గొలుసుకట్టు చెరువుల ద్వారా 70వేల గ్రామాలకు నీటి సౌకర్యం కల్పించారని పేర్కొన్నారు. మరో సీనియర్ న్యాయవాది మహేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల మేధావులు, రాజకీయ నాయకులను సంప్రదించిన తర్వాతే రాజముద్రను ఆమోదించారని, ఆనాడు అభ్యంతరం తెలుపని కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు రాజముద్రను మార్చడం విడ్డూరంగా ఉందని మండిపడ్డారు. కాకతీయ కళాతోరణంతో పాటు చార్మినార్ కూడా అత్యంత ప్రాధాన్యత కలిగిన చిహ్నాలని, వాటి గౌరవం తగ్గించేలా ఎవరు ప్రవర్తించినా ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు తాళ్లపల్లి జనార్దన్ గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాజముద్రలో అమరవీరుల స్తూపాన్ని చేర్చడం సరైందే ఐనప్పటికీ తెలంగాణ యువకులు మలిదశలోగాని తొలి దశలోగాని తమ ప్రాణాలను త్యాగం చేయడానికి కారణమే కాంగ్రెస్ పార్టీ అన్నది చరిత్ర తెలిసిన వారందరికీ తెలిసిన విషయమేనన్నారు. అమరుల చావులకు కారణమైన వారే ఈరోజు అమరవీరుల స్తూపం గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్యమంలో ఏనాడూ పాల్గొనని రాష్ట్ర ముఖ్యమంత్రి ఒక్కరోజైనా తెలంగాణ స్తూపం వద్ద నివాళులర్పించకుండా అమరవీరుల స్తూపం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కళాతోరణం, చార్మినార్‌ను తొలగించాలన్న ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం శాశ్వతంగా విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ అధ్యక్షుడు వినోద్‌కుమార్ మాట్లాడుతూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును ముక్తకంఠంతో ఖండిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులని, వారి మనోభావాలను దెబ్బతీస్తే రేవంత్‌రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్యామ్‌సుందర్‌రావు, సంసాని సునీల్, అబ్దుల్ నబీ, శివ రాజు, వసంత్ యాదవ్, మహేశ్ పటేల్ కిరణ్‌కుమార్, రాము పాల్గొన్నారు.



కాకతీయ కళాతోరణం రాచరికం కాదని.. అది ఓరుగల్లు రాజసం అని.. తెలంగాణ రాజముద్ర నుంచి తొలగించే నిర్ణయాన్ని వాయిదా వేయడం కాదు.. విరమించుకునే వరకూ నిరసనలు ఆపే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ స్పష్టం చేశారు. కాకతీయ కళాతోరణం తొలగించాలనే రాష్ట్ర సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నక్కలగుట్టలోని కాళోజీ జంక్షన్ వేదికగా టార్చ్ సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో శాంతి యుతంగా నిరసన తెలిపి మానవహారం నిర్వహించారు. కాళోజీ విగ్రహానికి పూలమాల వేసి రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన వద్దంటూ నినాదాలు చేశారు. - హనుమకొండ, మే 31

# అది రాచరికం కాదు.. రాజసం




## కాకతీయుల చరిత్రను చెరిపేస్తామంటే సహించం

- వాయిదా కాదు.. విరమించుకోవాల్సిందే.. కేసులకు అదరం... అరెస్టులకు బెదరం
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్
- అనాలోచిత నిర్ణయంపై సీఎం పునరాలోచించాలి
- లేకపోతే కాళోజీ ధిక్కార స్వరం రుచిచూపిస్తాం : ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- కాళోజీ జంక్షన్ వద్ద టార్చ్, బీఆర్ఎస్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిరసన, మానవహారం

వెయ్యేళ్ల సాంస్కృతిక వారసత్వానికి సాక్ష్యమైన కాకతీయ చరిత్రను చెరిపేస్తామంటే సహించబోమని దాస్యం హెచ్చరించారు. కాకతీయ కళాతోరణం రాచరికానికి గుర్తు అన్న సీఎం రేవంత్‌రెడ్డి అజ్ఞానానికి చింతిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలపై పోరాడుతుంటే కేసులు పెడుతున్నారని, తమకు కేసులు కొత్తేమీ కాదని, కేసులకు అదరం, అరెస్టులకు బెదరమని, పోరాట మార్గం విడిచే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఇది కాంగ్రెస్ నిర్ణయంగా భావించడం లేదన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలు పంచుకోని, చరిత్రపై అవగాహన లేని వ్యక్తి తెలంగాణ, ఓరుగల్లు చరిత్రను చెరిపివేయాలని చూస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. చరిత్ర గుర్తులను తొలగిస్తుంటే వరంగల్ జిల్లాకు చెందిన మంత్రులు వ్యతిరేకించకపోవడం సిగ్గుచేటు అని, కొండా సురేఖ, సీతక్క స్పందించాలని దాస్యం కోరారు. కాకతీయులు ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక కార్యక్రమాలు చేశారని, టెంపుల్స్, ట్యాంక్స్, టౌన్స్ విధానంతో జనరంజక పాలన అందించారన్నారు. ఈ లోగో ఉంటే కేసీఆర్ ప్రజల మదిలో ఉంటారనే పిచ్చి ఆలోచనతో ప్రభుత్వం ఉన్నట్లు భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నిర్ణయం తీసుకొనే సమయంలో తామంతా వ్యతిరేకిస్తే చరిత్రకారులతో చర్చిస్తాం.. సబ్ కమిటీ వేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారని గుర్తుచేశారు. నిజమైన కాంగ్రెస్‌వాదులు రేవంత్ నిర్ణయాన్ని వ్యతిరేకించడంతో పాటు తుగ్లక్ పాలనను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

**సీఎం పునరాలోచించాలి..**

సీఎం రేవంత్‌రెడ్డి కాకతీయ కళాతోరణం తొలగింపుపై పునరాలోచించాలని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. నాటి కాకతీయుల సామ్రాజ్య చరిత్ర, వారి విశిష్టతను గుర్తించే కళాతోరణాన్ని కేసీఆర్ రాజముద్రలో ఉంచారని, రాణీరుద్రమ ఉత్తర భారతదేశాన్ని పరిపాలించారన్నారు. కాకతీయుల చరిత్రను చెరిపేస్తే చెరిగిపోదన్నారు. కాళోజీ ధిక్కార స్వరాన్ని చూపిస్తామన్నారు. సీఎం పునరాలోచించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్ మర్రి యాదవరెడ్డి, కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, సోదా కిరణ్, రంజిత్‌రావు, సంకు నర్సింగ్, ఇమ్మడి రాజు లోహిత, రాజునాయక్, పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజినీకాంత్, జనార్దన్ గౌడ్, మైనార్టీ నాయకుడు నయీముద్దీన్, బీఆర్ఎస్వీ నాయకులు గంధ్రకోట రాకేశ్‌యాదవ్, పబ్బోజు శ్రీకాంత్ చారి, టార్చ్ సంస్థ వ్యవస్థాపకుడు అరవింద్ ఆర్య పాల్గొన్నారు.



హనుమకొండ కాళోజీ జంక్షన్ వద్ద ప్ల కార్డులతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ శ్రేణులు

## ఓరుగల్లు ఔన్నత్యాన్ని కించపరుచొద్దు



గణపురం, మే 31: ఓరుగల్లు కీర్తిని చాటేది కాకతీయ కళాతోరణం. ఎంతో చారిత్రక గుర్తింపు ఉన్న దీన్ని తెలంగాణ రాష్ట్ర రాజముద్ర నుంచి తొలగించడానికి సర్కారు ప్రయత్నం చేస్తోంది. మరోసారి పునరాలోచించి కళాతోరణాన్ని యథావిధిగా ఉంచాలి. ఆ చిహ్నాన్ని తొలగించి ఉమ్మడి వరంగల్ ఔన్నత్యాన్ని కించపరిచే ప్రయత్నం చేయొద్దు. 2014లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత అప్పటి ప్రభుత్వం రాజముద్రను రూపొందించి ఆ చిహ్నంలో చార్మినార్‌తో పాటు కాకతీయ కళాతోరణాన్ని చేర్చింది. ఈ కళాతోరణం కాకతీయుల సుపరిపాలనకు గుర్తుగా భావిస్తుంటారు. పదేళ్లుగా ఇదే రాజముద్ర కొనసాగింది. కళాతోరణం తొలగింపును ప్రతి ఓరుగల్లు బిడ్డ వ్యతిరేకించాలి. ఈ మేరకు సీఎంవో కార్యాలయానికి మెయిల్ కూడా పెట్టాం.

– కామిడి సతీశ్‌రెడ్డి, తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు




కూరపాటి వెంకటనారాయణ ఉద్యమంలోనే లేడని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని నిలదీస్తున్న బీసీ రాష్ట్ర నాయకుడు ఏదునూరి రాజమౌళి

# అసలైన ఉద్యమకారులకు గుర్తింపేది?

- అందరూ తెలంగాణ వ్యతిరేకులే..
- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని నిలదీసిన ఉద్యమకారులు రాజమౌళి, క్రాంతికుమార్

హనుమకొండ చౌరస్తా, మే 31 : తాత్కాలిక ఉద్యమకారుల ఎంపిక కమిటీలో అసలైన ఉద్యమకారులను పరిగణలోకి తీసుకోలేదని, అందరూ తెలంగాణ వ్యతిరేకులే ఉన్నారని బీసీ రాష్ట్ర నాయకుడు ఏదునూరి రాజమౌళి, ఎమ్మెల్సీ అభ్యర్థి తాటిశెట్టి క్రాంతికుమార్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని నిలదీశారు. నయీంనగర్‌లో జరిగిన సమావేశంలో వారు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. కేవలం మైకులు పట్టుకుని వేదికలపై మాట్లాడేవారే ఉన్నారని, నిజమైన ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారని వారు నిలదీశారు. ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ అసలు తెలంగాణ ఉద్యమంలో లేరని, పిలిస్తే వచ్చి మాట్లాడేదని, టీడీపీలో ఉన్న అలాంటి వ్యక్తి ఒక కమిటీ వేసి ఉద్యమకారులను ఎలా గుర్తిస్తారని ప్రశ్నించారు. స్పందించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కమిటీ సభ్యులు ఉద్యమకారులను గుర్తిస్తారని, ఒకవేళ మిస్సయితే ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లో ఎన్‌రోల్ చేయించాలన్నారు. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు హంటర్ రోడ్డులోని డీ-కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని, రాజకీయ పార్టీలకతీతంగా అందరిని ఆహ్వానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, అబూబక్కర్, పుల్లూరి సుధాకర్, బోడ డిన్న, రహీమున్నీసాబేగం ఉన్నారు.



మరిపెడ విద్యా హెర్బల్స్ ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు

# విషవాయువులతో ఉక్కిరిబిక్కిరి

- రెండు రోజులుగా ఇబ్బందిపడుతున్న ప్రజలు
- మరిపెడలోని విద్యా హెర్బల్స్ ఫ్యాక్టరీ ఎదుట ఆందోళన

మరిపెడ, మే 31 : పట్టణంలోని విద్యా హెర్బల్స్ మిర్చి ఫ్యాక్టరీలో సాంకేతిక లోపంతో పైపులైన్లు దెబ్బతిని కారం ఘాటుతో కూడిన విషవాయువులు వెదజల్లడంతో గురువారం నుంచి ప్రజలు ఊపిరాడక ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. 10, 11, 12, 13, 14వార్డులతోపాటు ఆర్లగడ్డ తండా ప్రజలు హెర్బల్స్ ఫ్యాక్టరీ ఎదుట శుక్రవారం ఆందోళన చేపట్టారు. రెండు రోజులుగా టెంట్ వేసి ఆందోళనకు ఉపక్రమిస్తున్న తరుణంలో పోలీసులు నిరసన తెలిపేందుకు అంగీకరించలేదు. ప్రజాపాలనలో నిరసన తెలిపే హక్కు లేకపోవడంతో ప్రజలు ఆగ్ర హం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. హెర్బల్స్ ఫ్యాక్టరీ వెదజల్లుతున్న విషవాయువులు, వ్యర్థాలతో గ్రామంలోని నల్ల చెరువు నీళ్లు కలుషితమయ్యాయని, పశువులు ఆ నీళ్లు తాగడం లేదని, మత్స్య సంపద దెబ్బతింటున్నదన్నారు. విషవాయువుల ప్రభావంతో గుండెపూడి, వెంకంపాడు, మరిపెడ, ఆర్లగడ్డ తండావాసులు అనారోగ్యానికి గురవుతున్నట్లు తెలిపారు. ఘటనా స్థలానికి సీఐ హథీరాం, ఎస్సైలు తహెర్‌బాబా, సంతోష్ చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. విషవాయువులు వెదజల్లకుండా సంస్థ ప్రతినిధులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, వామపక్ష పార్టీల నాయకులు కౌన్సిలర్ ఎడెల్లి పరశురాములు, ముదిరెడ్డి వీరారెడ్డి, కుడితి వెంకటరెడ్డి, షేక్ అజీజ్, దేవరశెట్టి లక్ష్మీనారాయణ, బాలనాగు శివశంకర్, ముదిరెడ్డి పవన్‌రెడ్డి, కుడితి నర్సింహారెడ్డి, ఉప్పల సతీశ్, రమేశ్, దేవరశెట్టి కృష్ణమూర్తి, ఐనాల పరశురాములు పాల్గొన్నారు.



| | |
|---|---|
| వెంకటాపూర్(ములుగు) | -46.2 |
| మొగుళ్లపల్లి(భూపాలపల్లి) | -45.9 |
| కొమ్ములవంచ(మహబూబాబాద్) | -44.8 |
| గొర్రెకుంట(వరంగల్) | -45.1 |
| పులుకుర్తి(హనుమకొండ) | -44.7 |

# నిప్పులకొలిమి

*గరిష్ఠంగా వెంకటాపూర్‌లో 46.2 డిగ్రీలు*

- దంచికొడుతున్న ఎండలు
- మూడు రోజులుగా తీవ్రం

భానుడు నిప్పులు కక్కుతున్నాడు. రోహిణి కార్తె మొదలవడంతో మూడు రోజులుగా ప్రతాపం చూపిస్తున్నాడు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో జనం విలవిల్లాడుతున్నారు. శుక్రవారం ములుగు జిల్లా వెంకటాపూర్‌లో అత్యధికంగా 46.2 డిగ్రీలు రికార్డయింది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ఎండ ధాటికి జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 9గంటల తర్వాత ఇంటినుంచి బయట అడుగుపెట్టేందుకు జంకుతున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం దాకా రద్దీ తగ్గిపోయి రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. కాగా వడదెబ్బ తగిలి ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మృత్యువాతపడ్డారు.

## వడదెబ్బతో ముగ్గురి మృతి



ఐలయ్య(ఫైల్)



రాంబాబు (ఫైల్)

చెన్నారావుపేట/మంగపేట/ఏటూరునాగారం, మే31: వడదెబ్బ తగిలి ముగ్గురు మృతి చెందారు. చెన్నారావుపేటకు చెందిన పల్లకొండ ఐలయ్య(74) కూలికి వెళ్లగా రెండు రోజులుగా ఎండ తీవ్రతకు అస్వస్థతకు గురయ్యాడు కుటుంబసభ్యులు దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మంగపేట మండలం రాజుపేటకు చెందిన దామెర రాంబాబు (50) వృత్తి రీత్యా ఎలక్ట్రికల్ పనిచేసేవాడు. ఎండ తీవ్రతతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు శుక్రవారం ఆర్‌ఎంపీ వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బీపీ చెక్ చేస్తున్న క్రమంలో కుప్పకూలిపోయాడు. ఏటూరునాగారం మండలం షాపల్లిలో మతిస్థిమితం సరిగా లేని మహిళ అడవిలో వడదెబ్బకు గురై మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం సోని(31) బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాకపోవడంతో భర్త మహేశ్, కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారు. కాగా, షాపల్లి సమీపంలోని రాజన్నగుట్ట-చెల్పాక మధ్యలోని అడవిలో గురువారం మృతదేహం ఉన్నట్లు గుర్తించారు. భర్త మహేశ్‌కు కూడా మతిస్థిమితం సరిగా లేదని గ్రామస్తులు తెలిపారు. విషయం తెలుసుకున్న ఏఎస్పీ మహేశ్ గీతే బాబా సాహెబ్ శుక్రవారం ఘటనా స్థలాన్ని సందర్శించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# కేయూ పరీక్ష జవాబు పత్రాలు బయటకు..

- సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన కంట్రోలర్
- కేయూ పీఎస్‌లో ముగ్గురిపై కేసు నమోదు

హనుమకొండ చౌరస్తా, మే 31 : కాకతీయ యూనివర్సిటీలో డబ్బుకు ఆశపడిన ముగ్గురు దినసరి వేతన కూలీలు ఎగ్జామినేషన్ బ్రాంచి నుంచి జవాబు పత్రాలు బయటకు పంపిన ఘటన కేయూలో దుమారం రేపుతోంది. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నర్సింహాచారి కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న దినసరి వేతన కూలీలు సునీల్, రాణా ప్రతాప్, శ్రీధర్ విద్యార్థుల జవాబు పత్రాలను తిరిగి వారికి చేరవేసి, మళ్లీ రాయించి ఆ తర్వాత గుట్టుచప్పుడు కాకుండా వాటిని ఎగ్జామినేషన్ బ్రాంచ్‌కు చేర్చినట్లు తెలుస్తోంది. ముగ్గురు దినసరి కూలీలను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. కాకతీయ యూనివర్సిటీలో జరిగిన ఘటనపై ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ సీరియస్ అయ్యారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్‌లో జరిగిన ఘటనపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డితో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నట్లు సమాచారం.



రఘు ఇంట్లో వికసించిన జమా కారు పుష్పం

# పదహారేళ్లకు పూసింది..

**శాయంపేటలో వికసించిన సియర్స్ జమాకారు పుష్పం**

శాయంపేట, మే 31 : హనుమకొండ జిల్లా శాయంపేట మండలం పెద్దకోడెపాకలో అరుదైన పుష్పం వికసించింది. సియర్స్ జమాకారు అని పిలిచే మొక్క 16 సంవత్సరాలకు ఒకసారి పూస్తుంది. గ్రామానికి చెందిన కోమనేని రఘు ఇంటి ఆవరణలో పెంచుతుండగా శుక్రవారం మొదటి పువ్వు పూసింది. ఇది కాక్టస్ జాతికి చెందిందని, మూత్రం ఇన్‌ఫెక్షన్, మూత్రపిండాల వాపు, రుమాటిజం చికిత్సలో ఉపయోగించే ఆహారం, ఔషధ ఉత్పత్తిలో వినియోగిస్తారని రఘు తెలిపారు.